వరదనీరు.. నిల్వ చేస్తే మేలు..!

- ఫాంపాండ్స్ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో ముందుకురాని అన్నదాతలు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


శివుపల్లిలో గుట్టపై కమ్యూనిటీ ఫాంపాండ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు


ఫాంపాండ్‌లో నీటి నిల్వ

ఎలిగేడు: వర్షాకాలంలో వరద నీరు వృథాగా పోకుండా ఫాంపాండ్స్ (నీటికుంటలు) తవ్వుకుని నిల్వ చేస్తే ఆ ప్రాంతంలో భూగర్భజలాలు పెరిగేందుకు తోడ్పడుతాయి. ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులు తలెత్తితే ఆ సమస్య నుంచి గట్టెక్కే అవకాశం ఉంటుంది. ఇంతటి మంచి ఉద్దేశాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఉపాధిహామీ కూలీలతో రైతుల వ్యవసాయ భూముల్లో నీటికుంటలు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ.. జిల్లాలో అన్నదాతలు మాత్రం ముందుకు రావడం లేదు.

భూగర్భజలాల పెంపు..

వర్షం కురిసినప్పుడు వాగులు, వంకల ద్వారా వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా వాగులపై చెక్‌డ్యాంలు నిర్మిస్తోంది. అలాగే రైతుల వ్యవసాయ భూముల్లో ఫాంపాండ్స్‌ను తవ్వుకునేలా ప్రోత్సహిస్తోంది. నీటి నిలవ్వలు పెరిగితే బోర్లు, బావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. ఇదే ఆలోచనతో ఉపాధిహామీ పథకం కింద నీటికుంటలను తవ్వుకోవాలని సూచించింది. దీనికి మండల పరిధిలోని రైతులు చాలామంది ముందుకొచ్చారు. కానీ.. వారికి అవగాహన లేక పోవడంతో ఆసక్తి చూపడంలేదు. నీటి కుంటలు తవ్వుకుంటే భూమి నష్టపోతామనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

నీటికుంటలతో మేలు

నీటికుంటలతో భూగర్భజలాలు పెరగడం ద్వారా వేసవిలో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉంటుంది. భారీవర్షాలకు భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. ఎగువ నుంచి వచ్చే నీటితో మట్టి గుంతలోకి చేరుతుంది. నీరు ఇంకిన తర్వాత ఆ మట్టిని పొలాల్లో ఎరువుగా వినియోగించుకోవచ్చు. పైగా బోర్ల ద్వారా నీటికుంటలను నింపుకుంటే పంటలకు ఒకేసారి తడులు అందించే వీలుంటుంది. ఎకరం పొలానికి అవసరమయ్యే నీటితో రెండెకరాలు సాగు చేయవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు. నీటి కుంటలతో వర్షాభావ పరిస్థితుల్లోనూ పంటలకు ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు.

పల్లపు ప్రాంతాల్లో నిర్మాణం

రైతులకు ప్రయోజనం చేకూర్చే ఈ నీటికుంటల నిర్మాణానికి అన్నదాతలు పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. మొదట వర్షపు నీటిని పొలంలో ఎక్కడ నిల్వ చేసుకోవాలో గుర్తించాలి. పల్లపు ప్రాంతంలో నీటికుంట నిర్మించుకుంటే మంచిది. ఉపాధి హామీ అధికారులకు దరఖాస్తు చేసుకుంటే సిబ్బంది వచ్చి కొలతలు నిర్ణయిస్తారు. ఆ ప్రకారం ఉపాధి కూలీలే తవ్వుతారు. ఫాంపాండ్స్ నిర్మాణం 20మీటర్ల పొడవు, 20మీటర్ల వెడల్పు, 12 మీటర్లు పొడవు, 12 మీటర్ల వెడల్పు, భూమితక్కువగా ఉన్న చిన్న రైతులు 2మీటర్ల వెడల్పు, 2మీటర్ల పొడవుతో నిర్మించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు వ్యవసాయ పొలాల వద్ద ఫాంపాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. ఫాంపాండ్స్ ఏర్పాటుతో భూమి వృథాగా పోతుందని ముందుకు రావడంలేదు. అయినప్పటికీ వీటితో కలిగే లాభాలను రైతులకు వివరించి నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. – సదానందం, ఈజీఎస్ ఏపీవో, ఎలిగేడు

కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడో..?


కల్వచర్లలో రైతులు తెచ్చిన ధాన్యం

కమాన్‌పూర్: యాసంగి వరి పంట కోతకు రావడంతో రైతులు వరికోతలు ప్రారంభించారు. వరి కోసిన రైతులు ధాన్యాన్ని ఏపీసీఎస్, ఐకేపీ కేంద్రాలకు తరలించి, ఎండను సైతం లేక్క చేయకుండా తేమ కోసం ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. కోతలు ప్రారంభించి పది రోజులవుతున్నా.. నేటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నారు. కొంతమంది మిల్లర్లకు అమ్ముకుని నష్టపోతున్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి కొప్పుల

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో మండల వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘాల జిల్లా ఫోరం అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, ఉపసర్పంచ్ ఆవుల లత, మండల పార్టీ అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వసతులు కల్పిస్తాం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో అన్ని రకాల వసతులు కల్పించి మెరుగైన సేవలందేలా చూస్తానని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంగళవారం మంథనిలోని గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు. గ్రంథాలయ సమీపంలో గదిని అద్దెకు తీసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. అభ్యర్థులకు తన సొంత ఖర్చులతో కూలర్లు, రెండు పూటలా భోజన సౌకర్యం కల్పిస్తానని జెడ్పీ చైర్మన్ భరోసా కల్పించారు. నిరుద్యోగ యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు ఏగోళపు శంకర్ గౌడ్, పూదరి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం


చెక్కు అందిస్తున్న మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో రేణుకాఎల్లమ్మ గుడి నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి రూ.50,116 విరాళం అందించారు. మంగళవారం గౌడ సంఘం నాయకులకు చెక్కు అందించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు ఉట్కూరి కొంరయ్యగౌడ్, వైస్ ప్రెసిడెంట్ కొత్తకొండ శ్రీనివాస్‌గౌడ్, డైరెక్టర్ పెద్ద కొంరయ్యగౌడ్, పాల్గొన్నారు.

ఇజ్జగిరి భూమయ్యకు కార్మికరత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న భూమయ్య

జ్యోతినగర్: బహుజన సాహిత్య అకాడమీ కార్మికరత్న జాతీయ అవార్డును ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన కార్మిక సంఘం నాయకుడు ఇజ్జగిరి భూమయ్య అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఉయ్యూరులో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ మూడో సదస్సులో అవార్డును జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అందుకున్నారు. భూమయ్యకు జాతీయ అవార్డు రావడంపై పలువురు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

'సుతిలి కొనుగోలులో అవినీతి లేదు'

మంథని: కరోనా, లాక్‌డౌన్‌తో వ్యాపార రంగంపై తీవ్ర ప్రభావం చూపిందని, జూట్ మిల్లుల్లో ఉత్పత్తి ఆగి పశ్చిమ బెంగాల్ నుంచి వ్యాగన్ల ద్వారా వచ్చే సుతిలి సరఫరా నిలిచిపోయిందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. సప్లై తగ్గి డిమాండ్ పెరిగిందని, దీన్ని అదునుగా భావించిన వ్యాపారులు తమ వద్ద ఉన్న సుతిలిని బ్లాక్ చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నారన్నారు. సుతిలి బ్యాగు రూ.3500 లభించేదని, ప్రస్తుతం రూ. 7 వేల నుంచి 8 వేల వరకు విక్రయిస్తున్నారని, దీంతో కొనుగోలు ఖర్చు పెరిగిందన్నారు. అంతే గాని సుతిలి కొనుగోలులో ఎక్కడా అవినీతి జరగలేదన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


రైతు విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే,నాయకులు

సుల్తానాబాద్: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని రకాల సదుపాయాలు అందుబాటులో ఉంచాలని కోరారు. తరుగు, తాలు, చెత్త పేరిట 1 కిలో నుంచి 2 కిలోలు జోకుమని చెప్పి రైతులు తర్వాత రైస్ మిల్లర్లు ఎక్కువగా జోకుతున్నారని రాజకీయం చేస్తున్నారన్నారు. హమాలీలు ఇన్సూరెన్స్‌ను, ఈ శ్రమ్‌ను వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రూ.10 లక్షల తో మార్కెట్‌లో నిర్మించిన రైతు ఎడ్ల బండి ప్రతిమ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంవో ప్రవీణ్ రెడ్డి, రైతు బంధు జిల్లా అధ్యక్షుడు కాసర్ల అనంత రెడ్డి,ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు, జెడ్పీటీసీ మినుపాలస్వరూపమార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, రైతు సమితి అధ్యక్షుడు రాజ మల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, తదితరులు పాల్గొన్నారు. జవహర్ నగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త పెగడ చందు ప్రమాదవశాత్తు మరణించగా, బాధిత కుటుంబానికి మంజూరైన రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో ముస్లింలకు దుస్తులు పంపిణీ చేశారు.

'గీత కార్మికులకు అన్యాయం చేస్తుండ్రు'

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గీత కార్మికులకు అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు బుషణవేన రమేశ్‌గౌడ్ అన్నారు. పెద్దపల్లి మండలం పాలితం కు చేరిన కాంగ్రెస్ పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందించారు. ప్రాజెక్టుల నిర్మాణ సయంలో ఈత, తాటివనాలు కోల్పోయిన కార్మికులకు పరిహారం అందలేదన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నడుపుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో గీతకార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. గీత కార్మికులకు న్యాయం కలిగేలా చూడాలని కోరారు.

పునీత్‌సాగర్ అభియాన్‌లో ఎన్‌సీసీ కెడెట్లు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ కెడెట్లు మంగళవారం పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. పెద్దబొంకూర్ శివారులోని హుస్సేనిమియా వాగు పరివాహక ప్రాంతాన్ని శుభ్రం చేశారు. వాగులో ప్రవహించే నీరు శుభ్రంగా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ రేళ్ల సంజీవ్ అన్నారు. సీనియర్ కెడెట్లు సాయికుమార్, అజయ్, సంపత్ పాల్గొన్నారు.

'శక్తి' కేంద్రాలను బలోపేతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావులు రాజేందర్


బీజేపీలో చేరుతున్న ఆమ్‌ఆద్మీ నాయకులు

సుల్తానాబాద్: బీజేపీ శక్తి కేంద్రాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు.సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రి నగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు గ్రామ గ్రామాన చేరేవేసి చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు నాయకులపై ఉందన్నారు. పట్టణంలోని అన్ని బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కూకట్ల నాగరాజు, పల్లే తిరుపతి, ఆరెపల్లి రాహుల్, గజభింకర్ పవన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మంథని వెనుకబాటే..

మంథని: నియోజకవర్గాన్ని హేమాహేమీలు పాలించినా అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూడిద తిరుపతి బీజేపీలో చేరగా, పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో చంద్రుపట్ల సునీల్ రెడ్డి, అసెంబ్లీ కో–కన్వీనర్ నాంపల్లి రమేశ్,తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలి

కమాన్‌పూర్: బీజేపీని గ్రామగ్రామాన బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికై మొదటి సారిగా రామగిరి మండలానికి వచ్చిన సందర్భంగా రాజేందర్‌కు బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాతంగి రేణుక, మొలుమూరి శ్రీనివాస్, తొట్ల రాజు, కుంట చక్రి, మెరుగు శ్రీకాంత్, కన్నూరి మోహన్, ఓదెలు, బనుక సంతోష్ ఉన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఫైర్ అధికారులు

పెద్దపల్లిరూరల్: వేసవిలో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, అప్రమత్తతతో నియంత్రించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి పట్టణ శివారు రంగంపల్లిలో పెట్రోల్‌బంకు నిర్వాహకులకు మంగళవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం సంభవిస్తే నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో అడిషనల్ ఫైర్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రామగుండం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐఅంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లిలో మంగళవారం అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారుల బృందం పలువురికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కుందనపల్లి గ్రామ శివారులో ఉన్న ఓ పేపర్ ప్లేట్ల కంపెనీలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగే తీసుకోవాల్సిన చర్యలపై పోస్టర్లతో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు జాగ్రత్తలు పాటిస్తే నష్ట నివారణకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ యజమాని రామిని శేఖర్, జిల్లా అగ్నిమాపక ఆర్.సత్యనారాయణ, లీడింగ్ ఫైర్‌మెన్ రమేశ్, ఆపరేటర్లు తదితరులున్నారు.

'విమర్శించడం ఫ్యాషన్‌గా మారింది'

యైటింక్లయిన్‌కాలనీ: విమర్శించడం అనేది ఒక ఫ్యాషన్ గా మారిందని బీఆర్ఎస్ పార్టీ రామ గుండం నియోజకవర్గ ముఖ్య అధికార ప్రతినిధి రామ్మూర్తి అన్నారు. మంగళవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేసీఆర్ నేతృత్వంలో పనిచేస్తున్న ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులపై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పు తోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నాడు ఓసీపీ లు రావడానికి , బొగ్గు గనుల ప్రైవేటీకరణకు కాంగ్రెస్ పార్టీ కారణం కాగా ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్నట్లు చెప్పడం సిగ్గు చేటు అన్నారు. సింగరేణి కార్మికుల కోసం నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు బీజేపీ, కాంగ్రెస్‌లకు లేదన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ నాయకులు మేడి సదయ్య, దామోదర్ రావు, గోపాల్ రావు, రాంచందర్ పాల్గొన్నారు.

రైస్‌మిల్ గోదాంలో తనిఖీలు



మంథని: మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లి రైస్‌మిల్‌లో సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. రైస్ మిల్లుల్లో స్టాక్ వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే బుధవారం హమాలీల సాయంతో ఫిజికల్ వెరిఫికేషన్ చేస్తారని డీఎస్‌వో తోట వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే మంథని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు చేపట్టారు. ఇటీవల సుల్తానాబాద్ లోని ఓ రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం పట్టుబడిన నేపథ్యంలో మంథనిలోని ఎంఎల్ఎస్ పాయింట్, రైస్ మిల్లుల్లో సోదాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. అధికారులు పూర్తి స్థాయిలో సోదాలు నిర్వహించకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సోదాల్లో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు వైద్య పరీక్షలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న బాలికల రెసిడెన్షియల్ సదస్సులో పాల్గొనే బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. మంగళవారం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి ఆస్పత్రి వైద్య సిబ్బంది కాకతీయ ఆడిటోరియంలో వైద్య పరీక్షలను ఏజీఎం హెచ్ఆర్ బిజయ్‌కుమార్ సిగ్దర్, ఆస్పత్రి ముఖ్య వైద్యాధికారి రాంలహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు నెల రోజుల శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇంగ్లీషు, హిందీ, గణితం, సైన్స్ అంశాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రతను కాపాడే మార్గాల గురించి బోధించనున్నారని స్పష్టం చేశారు. నెల రోజుల పాటు జరిగే సదస్సులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు 12వ తరగతి వరకు ఎన్టీపీసీ రామగుండం టౌన్‌షిప్‌లోని అత్యుత్తమ పాఠశాలల్లో పైచదువులను ఉచితంగా అభ్యసించే అవకాశాన్ని పొందుతారని వెల్లడించారు. కార్యక్రమంలో డీజీఎం ప్రశాంత్ శామ్యూల్, డాక్టర్లు అర్చన, తారా, ద్విజశ్రీ, అసిస్టెంట్ మేనేజర్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ

పెద్దపల్లిరూరల్: గ్రూప్ 2,3,4 పోటీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ అభ్యర్థులకు మంగళవారం ఉచితంగా స్టడీమెటీరియల్ అందించారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నాగలైశ్వర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డి, ఉపాధికల్పనాధికారి తిరుపతిరావు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరెల్లి దేవక్క, జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద అన్నారు. మండలంలోని రత్నాపూర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, సర్పంచ్ పల్లె ప్రతిమ, ప్రభుత్వ వైద్యాధికారి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ సత్యరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని కోనరావుపేటలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరంలో గ్రామస్తులు పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు.మంగళవారం నిర్వహించిన పరీక్షలలో148 మంది పరీక్షలు చేయించుకోగా 50 మందికి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై నివేదిక ఇవ్వండి

మంథని: మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ మంచినీటి సరఫరా ఏ విధంగా జరుగుతుందో, సమస్యలేమైనా ఉన్నాయో తెలుపుతూ నివేదికలు పంపాలని ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో రమేశ్ ఆదేశించారు. మంచినీటి సరఫరా సరిగ్గా అవుతుందా, ఆయా గ్రామాల ఆపరేటర్లతో క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు.

నిత్యావసర సరుకులు అందజేత

కాల్వశ్రీరాంపూర్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మజీద్ కమిటీ నేతృత్వంలో మంగళవారం పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, బియ్యం పంపిణీ చేశారు. అల్లా ఆదేశానుసారమే తాము నిరుపేదలైన పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు అందించామని మజీద్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. హఫీజుద్దీన్, రహీం, ఖదీర్, నజీర్, నైఫిల్, అబ్దుల్ పాల్గొన్నారు.

రాములపల్లిలో కంటి వెలుగు ప్రారంభం

ఎలిగేడు: మండలంలోని రాములపల్లిలో మంగళవారం కంటివెలుగు ప్రారంభించారు. ఈసందర్భంగా 149 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 34 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా, క్యాంపు మెడికల్ ఆఫీసర్ స్వప్న, సర్పంచ్ సౌమ్య, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ, పంచాయతీ కార్యదర్శి రమ్యను జెడ్పీటీసీ మ్యాదరబోయిన శారద, వైఎస్ ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా అవార్డు పొందిన సందర్భంగా సర్పంచ్, కార్యదర్శిని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మ్యాదరబోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు ఎంపీపీ స్రవంతి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజు తెలిపారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

20న క్యాంపస్ డ్రైవ్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో ఈనెల 20 న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 8309594634, 9533166174లో సంప్రదించాలన్నారు.

నేడు గుంపులకు సీఎల్పీ నేత రాక

ఓదెల: పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా మండలంలోని గుంపుల గ్రామానికి బుధవారం రాత్రి సీఎల్పీనేత భట్టి విక్రమార్క రానున్నారు. పాదయాత్ర, సమావేశం జరగనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదే గ్రామంలోని రామభద్ర ఆలయం పక్కన బస చేయనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధిలో పెద్దపల్లి టాప్

ఓదెల:అభివృద్ధిలో పెద్దపల్లి నియోజకవర్గం టాప్‌లో నిలిచిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని హరిపురం, పిట్టలపల్లె గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులతో పెద్దపల్లి నియోజకవర్గం అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, రైతుసమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీచిన్నస్వామి, సర్పంచులు గుండేటి మధు, పిట్టల సరిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఎలిగేడు: మండలంలోని రాములపల్లి, ముప్పిరితోటలో మంగళవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలపై ఇంటింటికీ ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సర్పంచులు ఐలయ్య, సౌమ్య పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు


శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రామగుండం: పట్టణంలోని శివాలయంలో మంగళవారం మాస శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి కమ్మల చంద్రశేఖర్ శర్మ నేతృత్వంలో శివలింగానికి విశేష పూజల అనంతరం పుణ్య దంపతులతో గర్భగుడిలో నేరుగా అభిషేకం చేయించే అవకాశం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

స్వామి వారికి రుద్రాభిషేకం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి వివిధ రకాల పండ్లతో ఐతు సతీశ్ రాధిక దంపతులు రుద్రాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.